హామీలకు బ్రేక్.. ప్రజలకు షాక్

కూటమి ప్రభుత్వం ప్రజలపై వేసిన విద్యుత్తు ఛార్జీల భారం తగ్గించాలనే ప్రజల నినాదాలతో ఉవ్వెత్తున ఉద్యమం సాగింది. ఎన్నికలకు ముందు విద్యుత్తు చార్జీలు పెంచమని హామీలిచ్చిన చంద్రబాబు.. వినియోగదారుల నెత్తిన కుచ్చుటోపీ పెట్టి కోట్ల రూపాయల భారం మోపారు. దీనిపై ప్రజాగ్రహం ఉద్యమ రూపంలో శుక్రవారం ఎగసిపడింది.

- ప్రజలపై రూ.15 వేల కోట్ల భారం
- డిస్కంలను నిర్వీర్యం చేసిన ఘనత చంద్రబాబుదే
- ఎన్నికల్లో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారు
- పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించాలని నిరసన
- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ


కడప నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కడప కార్పొరేషన్‌: కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి.అంజద్ బాషా, మేయర్ సురేష్‌బాబు డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు ×పెంచిన కరెంట్ చార్జీలపై వైఎస్సార్‌సీపీ పోరుబాట¥ పేరుతో పార్టీ కార్యాలయం నుంచి ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్, సంధ్యా సర్కిల్, ఎర్రముక్కపల్లె సర్కిల్ మీదుగా విద్యుత్తు భవన్ వరకూ ఈ ర్యాలీ సాగింది. ప్లకార్డులు పట్టుకొని విద్యుత్ చార్జీలు తగ్గించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ భారీ ర్యాలీగా ముందుకు కదిలారు. అనంతరం ఆపరేషన్ ఎస్‌ఈ రమణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అంజద్ బాషా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో బిల్లులు పట్టుకుంటే విద్యుత్తు షాక్ కొడుతోందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి వాటి బలోపేతానికి చర్యలు తీసుకున్నారని తెలిపారు. చంద్రబాబు ఎన్నికల సభల్లో కరెంటు చార్జీలు పెంచనని, పైగా తగ్గిస్తానని హామీ ఇచ్చారన్నారు. వైఎస్ జగన్ ఆరు సార్లు విద్యుత్ చార్జీలు పెంచారని, నిత్యావసర ధరలు పెరిగిపోయాయని ఆనాడు చంద్రబాబు సంగనాచి కబుర్లు చెప్పారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లోనే రెండు సార్లు కరెంటు చార్జీలు పెంచి రూ.15480కోట్ల భారం ప్రజలపై మోపిందని మండిపడ్డారు. దీపావళి కానుకగా రూ.6074 కోట్లు, క్రిస్మస్ కానుకగా రూ.9 వేల కోట్లు భారం చేసి ప్రజల నడ్డి విరిచారన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో పరిస్థితి అధ్వాన్నంగా ఉందని, బకాయిల పేరుతో విద్యుత్తు కనెక్షన్లు కట్ చేస్తున్నారన్నారు. డిస్కంలను నిర్వీర్యం చేసిన ఘనత చంద్రబాబుదేనన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగిపోయాయని, ఒక్క నూనెపైనే రూ.40లు పెంచారన్నారు. ప్రభుత్వం చేసే తప్పులను ఎత్తిచూపుతానని చెప్పిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇప్పుడు ఎక్కడున్నారని ప్రశ్నించారు. అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, మహిళలకు నెలకు రూ.1500, నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత ప్రయాణం హామీలు అటకెక్కాయని ఎద్దేవా చేశారు.

పోలవరం మినహా మరేమీ పట్టడం లేదు

కూటమి ప్రభుత్వానికి అమరావతి, పోలవరంపై ఉన్న శ్రద్ధ వేరే అంశాలపై లేదని మేయర్ సురేష్ బాబు విమర్శించారు. కొత్త ప్రభుత్వానికి కొంత సమయం ఇవ్వాలని తాము కూడా భావించామని, అయితే ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రోడ్లపైకి రాక తప్పడం లేదన్నారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు ఇస్తామని ఇవ్వలేదన్నారు.

సూపర్ సిక్స్ పథకాల ఊసే లేదన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ పథకాన్ని దూరం చేసేందుకు కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. కరెంటు చార్జీలు ఇప్పుడే ఇలా ఉంటే రానున్న వేసవిలో ఇంకెలా ఉంటాయోనని ఆందోళన వ్యక్తం చేశారు. పెంచిన చార్జీలు ఉపసంహరించుకోకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ మాజీ సభ్యులు మాసీమ బాబు, యానాదయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు జయచంద్రారెడ్డి, బంగారు నాగయ్య, వేణుగోపాల్ నాయక్, సీహెచ్.వినోద్, దాసరి శివప్రసాద్, గుంటినాగేంద్ర, కె.బాబు, పవర్‌అల్తాఫ్, కిరణ్, లక్ష్మయ్య, సుబ్బరాయుడు, శ్రీరంజన్‌రెడ్డి, మహిళా నేతలు టీపీ వెంకట సుబ్బమ్మ, పత్తిరాజేశ్వరి, ఉమామహేశ్వరి, రత్నకుమారి, మూలే సరస్వతి, నారాయణమ్మ, సుశీలమ్మ, చైతల్య, మల్లీశ్వరి, కార్యకర్తలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


ఎస్‌ఈ రమణకు వినతి పత్రం సమర్పిస్తున్న అంజద్‌బాషా, సురేష్‌బాబు, తదితరులు

క్లుప్తంగా

ప్రచార జాత

కడప ఎడ్యుకేషన్‌: ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య ఆవిర్భావం జరిగి 50 వసంతాలు పూర్తయిన సందర్భంగా జనవరి 5వ తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకు కాకినాడలో స్వర్ణోత్సవ రాష్ట్ర విద్యా వైజ్ఞానిక మహాసభలు నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్‌రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాధన విజయకుమార్, పాళెం మహేష్‌బాబు తెలిపారు. దీనికి సంబంధించిన ప్రచార జాతా శనివారం ఉదయం తొమ్మిది గంటలకు జమ్మలమడుగులో ప్రారంభమై ప్రొద్దుటూరు, మైదుకూరు, బద్వేల్ మీదుగా సాయంత్రం కడపకు చేరుకుంటుందని తెలిపారు. ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

రాయలసీమ సమస్యలపై లింగమూర్తి పోరాటం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్‌: రాయలసీమ ప్రాంత అభివృద్ధి కోసం కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు కామ్రేడ్ లింగమూర్తి తన జీవిత కాలం పోరాటం చేశారని ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి అన్నారు. నగరంలోని పిఎస్ నగర్, సింగపూర్ టౌన్షిప్, శివానందపురంలో ఆయన పర్యటించి పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులను ఆయన సభకు ఆహ్వానించారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ శనివారం లింగమూర్తి స్మారక స్థూపం ఆవిష్కరణ, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 84 సంవత్సరాల వయసులోనూ ఆయన అనేక ఉద్యమాలు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌సీపీ నగర కార్యదర్శి మక్బూల్ బాషా, కార్యవర్గ సభ్యులు మడగలం ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, విజయకుమార్, ఖాశీం, గంగన్న, మునిరెడ్డి పాల్గొన్నారు.

నిరాశ్రయులకు చేయూత


సరకులు అందజేస్తున్న వలంటీర్లు

వైవీయూ: నిరాశ్రయులకు జాతీయ సేవా పథకం వలంటీర్లు చేయూత అందించడం అభినందనీయమని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.వి.సలీంబాషా అన్నారు. కళాశాల ఎన్‌ఎస్ఎస్ ఆధ్వర్యంలో కడప నగర పరిధిలోని బృందా స్ఫూర్తి నిరాశ్రయుల వసతి గృహానికి నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలను విద్యార్థులు కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డా.గురివిరెడ్డి, డా.జి.విజయలక్ష్మి, డా.పి.శచీదేవి, డా.ఎం.గురుమోహన్‌రెడ్డి వసతి గృహ నిర్వాహకులు బాలసుబ్బయ్య, సుధారాణి, వలంటీర్లు పాల్గొన్నారు.

ఒంటిమిట్టలో విశాఖ యువత


ఆలయం వద్ద వైజాగ్ యువకులు

వైవీయూ: ఒంటిమిట్టలోని ఏకశిలా నగరమైన కోదండరామాలయాన్ని విశాఖ యువత దర్శించుకోవడం సంతోషదాయకమని ఒంటిమిట్ట మండల ప్రత్యేకాధికారి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య అన్నారు. నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో జరిగేఅంతర్ జిల్లా యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రాంలో భాగంగా జిల్లాలోని ప్రముఖ క్షేత్రాలను విశాఖ యువకులు శుక్రవారం దర్శించుకున్నారు. సిద్ధవటం కోటను వారు పరిశీలించి, చారిత్రక నేపథ్యాన్ని తెలుసుకున్నారు. అనంతరం నగరం పారిశ్రామిక ప్రాంతంలో గల షిరిడి సాయి ఎలక్ట్రికల్స్ ఇండస్ట్రీ కారాగారాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీఐ బహిరంగ సభ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్‌: సీపీఐ శత వార్షికోత్సవం సందర్భంగా శనివారం నగరంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ శనివారం సాయంత్రం నాలుగు గంటలకు కడప నగరంలోని కోటిరెడ్డి సర్కిల్ వద్ద నుంచి ప్రదర్శన ప్రారంభమవుతుందన్నారు. పాత కలెక్టరేట్ వద్ద బహిరంగ సభ జరుగుతుందని, ఈ సభకు రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య హాజరవుతారని తెలిపారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

పెండ్లిమర్రి : మహాత్మాగాంధీ జాతీయగ్రామీణ ఉపాధిహామీ పథకంలో చేపట్టిన వివిధ పనుల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి తెలిపారు. పెండ్లిమర్రిలో శుక్రవారం 18వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సమావేశం నిర్వహించారు. మండలంలో 19 గ్రామ పంచాయతీల్లో 01-04-2023 నుంచి 31-03-2024 వరకు జరిగిన 996 పనులకు సంబంధించి రూ.12 కోట్ల ఉపాధి పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. వాటిలో పండ్లతోటల పెంపకం, ఫారంపాండ్స్, డకౌట్ గుంతలు వంటి పనులు చేపట్టారు. విటిని సామాజిక తనిఖీ బృందం సభ్యులు పనులను పరిశీలించి గ్రామ సభలు నిర్వహించారు. గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన సోషల్ ఆడిట్ నివేదికలను డీఆర్పీలు చదివి వినిపించారు. ఏపీడీ సోమశేఖర్ రెడ్డి, ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి, ఏపీఓలు ఓబులమ్మ, రామాంజనేయరెడ్డి, డీఆర్పీలు, సీఆర్పీలు, ప్రజలు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఏఎస్‌ఓ మృతి


ఇలియాస్‌ఖాన్ (ఫైల్)

కడప ఎడ్యుకేషన్‌: సమగ్ర శిక్ష కార్యాలయంలో పనిచేస్తున్న అసిస్టెంట్ స్టాటికల్ ఆఫీసర్(ఏఎస్‌ఓ) ఇలియాస్‌ఖాన్ గురువారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. పులివెందుల ఇస్లాంపురం హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఈయన 202 నుంచి సమగ్రశిక్షలో ఏఎస్‌ఓగా నియమితులయ్యారు. గురువారం రాత్రి గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు తెలిసింది. ఆయనకు భార్య, కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. డీఈఓ మీనాక్షి, సమగ్ర శిక్ష సూపరింటెండెంట్ మురళీమోహన్, సిబ్బంది మృతుడి పార్థివదేహాన్ని సందర్శించి కుటుంబీకులను పరామర్శించారు. ఖనన ఖర్చులకు విద్యా శాఖ తరఫున రూ.25 వేలు అందించినట్లు సమగ్ర శిక్ష సూపరెండెంటెంట్ మురళీమోహన్ తెలిపారు.

ఆర్టీసీ సీసీఎస్ డైరీ ఆవిష్కరణ


డైరీ ఆవిష్కరిస్తున్న కడప ఎమ్మెల్యే మాధవి

కడప కోటిరెడ్డి సర్కిల్‌: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ–2025 డైరీని శుక్రవారం సాయంత్రం కడప శాసన సభ్యురాలు ఆర్.మాధవి ఆవిష్కరించారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కడప డిపో కార్యదర్శి సగినాల శ్రీనివాసులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే నెంబర్‌వన్ గా నిలిచి, ఉద్యోగులకు అత్యుత్తమ సేవలందిస్తున్న సంస్థ డైరీ విడుదల చేయడం అభినందనీయమన్నారు ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ సంయుక్త కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను వేధిస్తున్న డీఈఓ మా కొద్దు


నినాదాలు చేస్తున్న ఐక్య ఉపాధ్యాయ సంఘ నాయకులు

ఉపాధ్యాయ ఐక్యవేదిక నాయకులు

కడప ఎడ్యుకేషన్‌: పాఠశాలల తనిఖీకి వెళ్లినప్పుడు హెచ్‌ఎంలతోపాటు ఉపాధ్యాయులను తీవ్రంగా దుర్భాషలాడుతూ మానసిక క్షోభకు గురిచేస్తున్న డీఈఓ మీనాక్షి మాకొద్దు అంటూ ఉపాధ్యాయ ఐక్య వేదిక నాయకులు పేర్కొన్నారు. ఇందుకు నిరసనగా ఈ నెల 30వ తేదీన డీఈఓ కార్యాలయం ఎదట ధర్నా చేస్తున్నామని వైఎస్సార్ జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక నాయకులు ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు తెలిపారు. కడప డీసీఈబీ సమావేశ మందిరంలో ఉపాధ్యాయ సంఘాల ఐద్య వేదిక నాయకులు శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డీఈఓగా బాధ్యతలు తీసుకున్న మీనాక్షి పాఠశాలలు సందర్శించినపుడు అక్కడి ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులను దుర్భాషలాడుతూ మానసిక క్షోభకు గురి చేస్తున్నారన్నారు. అమె అడిగిన దానికి సమాధానం చెప్పినా ఏదో ఒక వంక చూపుతూ తిట్ల తండకం మొదలు పెడుతోందని ఆరోపించారు. ప్రధానోపాధ్యాయులతోపాటు ఉపాధ్యాయులను కనీసం కూర్చోమని చెప్పకపోవడం శోచనీయం అన్నారు. ఇందుకు నిరసనగా ఈ నెల 30వ తేదీన డీఈఓ కార్యాలయం ఎదట ధర్నాకు పిలుపునిచ్చామన్నారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో ధర్నాకు హాజరుకావాలని తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ సంఘాలు ఎస్టీయూ, పీఆర్‌టీయూ, ఏపీటీఎఫ్ 257, ఏపీటీఎఫ్ 1938, పీఎస్‌టీయూ, ఆర్‌యూపీపీ, ఆపస్, స్కూల్ అసిస్టెంట్ అసోసియేషన్, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్, ఆర్జేయూపీ, హౌస్ బిల్డింగ్ సొసైటి, ఎస్టీఎఫ్, ఎస్‌ఆర్‌టిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ కేసులపై సమీక్ష


సమీక్షిస్తున్న జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్

కడప అర్బన్‌: కడప జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా సదన్‌లో హిట్ అండ్ రన్ కేసులపై జిల్లా న్యాయ సేవాధికారసంస్థ సెక్రటరి, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ కేసులను అధ్యయనం చేసి త్వరితగతిన పరిష్కార మార్గాలను చూపాలని సూచించారు. కడప, రాయచోటి అధికారులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులే మార్గదర్శకులు

కడప కల్చరల్‌: టీనేజ్ పిల్లలకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులే మార్గదర్శకులు అని మానవత సంస్థ సెంట్రల్ కమిటీ డైరెక్టర్, రాటాల గోపి అన్నారు. కడప సాయి విజ్ఞాన్ హైస్కూల్‌లో నైతిక విలువలు అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ తల్లి ప్రేమ స్వచ్ఛమైనదని, ప్రస్తుతం తల్లిదండ్రులకు పిల్లలు గౌరవం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. టీనేజీ దశలో తప్పుడు దారుల్లో వెళ్లే ప్రమాదముందని హెచ్చరించారు. సంస్థ సహ కార్యదర్శి అవ్వారుసుబ్బయ్య మాట్లాడుతూ మానవతా లక్ష్యాలను వివరించారు. విద్యార్థులు ఉత్సాహంగా తమ అభిప్రాయాలను తెలిపారు. పాఠశాల కరస్పాండెంట్ మైథిలి, డైరెక్టర్ భూపతి రాయల్ మానవత సంస్థ ఏర్పాటు చేయనున్న దహన వాటికకు రూ.లక్ష విరాళంగా ప్రకటించారు. ఈ సందర్భంగా పోటీలలో విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపిక అందజేశారు. ప్రతిభ చూపిన పేద విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు.



ప్రతిభ చూపిన విద్యార్థులతో అతిథులు

పేదలకు చేయూత: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కడప శాఖ ప్రతినిధులు పేదలకు ఆపన్న హస్తం అందించారు. స్థానిక అపార్ట్ మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న వ్యక్తి మనవడు తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి వైద్య ఖర్చులకుగానూ బాలుడి తండ్రికి రూ.6 వేలు, క్రీడా సామగ్రి కొనేందుకు కడపకు చెందిన క్రీడాకారిణి లలితారెడ్డికి రూ.10వేలు సెంట్రల్ కమిటీ డైరెక్టర్ రాటాల గోపి అందజేశారు. అవటాల రామాంజులరెడ్డి, పి.సుబ్బరాయుడు, బీవీ.సుబ్బరాయుడు, ఎ.సుబ్బయ్యపాల్గొన్నారు.

టీకాలు కనిపెట్టిన శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్

– ఆత్మ పీడీ విజయలక్ష్మి


టీకా కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జేడీ శారదమ్మ

కడప అగ్రికల్చర్‌: ప్రపంచంలో మొదటిసారిగా టీకా కనుగొన్న శాస్త్రవేత్త లూయిస్ పాశ్చర్ అని అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ(ఆత్మ) ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. లూయిస్ పాశ్చర్ జన్మదినం సందర్భంగా కడప పశుసంవర్థశాఖ కార్యాలయంలో జేడీ శారదమ్మ ఆధ్వర్యంలో టీకాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ సూక్ష్మజీవుల వల్ల కలిగే రోగాల నుంచి లూయిస్ పాశ్చర్ విముక్తి కల్పించారన్నారు. జిల్లా పశువంవర్థశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర శారదమ్మ మాట్లాడుతూ గ్రామాలలో పశువులు, ఆవులు, గొర్రెలకు కోళ్లకు అవసరమైన టీకాలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గుణశేఖర్ పిళ్లై, డీడీ మాలకొండయ్య, డాక్టర్ రంగస్వామి, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ రాంబాబు, డాక్టర్ సంధ్యారాణి, డాక్టర్ నేతాజీ, డాక్టర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆరు నెలలైనా ఉద్యోగుల సమస్యలు పట్టవా?

కడప ఎడ్యుకేషన్‌: అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా కూటమి ప్రభుత్వానికి ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలు పట్టడంలేదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ్‌కుమార్, పాలెం మహేష్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. కడప యూటీఎఫ్ భవన్‌లో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ 2023 జూలై, 1వ తేదీ నుంచి 12వ పీఆర్సీ అమలు చేయాల్సి ఉన్నప్పటికీ స్పందించలేదన్నారు. నూతన పీఆర్సీ కమిషన్ ఏర్పాటుచేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన రూ.23వేల కోట్ల బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. 117 జీవో, కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు నరసింహారావు, సివి.రమణ, రూతుఆరోగ్యమేరి, ప్రభాకర్, గోపీనాథ్, ఎ.డి.దేవదత్తం, కరీముల్లా, తదితరులు పాల్గొన్నారు.


యూటీఎఫ్ సమావేశంలో మాట్లాడుతున్న మాదన విజయ్‌కుమార్

ఖనిజ సంపదపై పరిశోధనలు జరగాలి

వైవీయూ: కడప జిల్లా ఖనిజ సంపదకు నిలయమని, విస్తృత పరిశోధనలు జరగాల్సి ఉందని యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. వైవీయూలో పెట్రోలియం జియాలజిస్టుల సంఘం ఆధ్వర్యంలో ×ఎక్స్‌ప్లోరింగ్ ద ప్రొటిరోజోయిక్స్ ఆఫ్ సౌత్ ఇండియా, క్లాస్టిక్ అండ్ కార్బొనేట్ రాక్స్ ఆఫ్ కడప బేసిన్¥ అంశంపై ఐదు రోజుల వర్క్‌షాప్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ దేశంలోని అత్యున్నత పరిశోధన సంస్థల నుంచి సైంటిస్టులు రావడం, ఖనిజ సంపదను అధ్యయనం చేయడం మంచి పరిణామం అన్నారు. కడప బేసిన్‌లో హైడ్రో కార్బన్ల అన్వేషణ జరగాల్సి ఉందన్నారు. ఇలాంటి వర్క్‌షాపల ద్వారా పరస్పర మేధో మార్పిడి, పరిశోధన పత్రాల కోసం విద్యావేత్తల భాగస్వామ్యం లభిస్తుందన్నారు. ఓఎన్‌జీసీ కావేరి బేసిన్ జనరల్ మేనేజర్ డాక్టర్ పి.ఆర్ముగం మాట్లాడుతూ 30 మందితో కూడిన పరిశోధన బృందం సమగ్ర పరిశీలన చేస్తామన్నారు. వర్క్‌షాప్ కన్వీనర్లు ఆచార్య వంగల సునీత, డాక్టర్ ఎస్. శ్రీనివాస గౌడ్ నేతృత్వంలో ఆయిల్ ఇండియా (ఢిల్లీ) కృష్ణ గోదావరి బేసిన్ (ఆంధ్రప్రదేశ్), అంకాళేశ్వర ఆయిల్ ఫీల్డ్ (గుజరాత్), అస్సాం ఆయిల్ ఫీల్డ్ (దిబ్రోఘ్) సంస్థల నుంచి 30 మంది పరిశోధకులు ఐదు రోజుల పాటు జిల్లాలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. తర్వాత సర్వే నివేదిక (మోనోగ్రామ్) ప్రచురించి భారత ప్రభుత్వానికి అందజేస్తారని ఆయన వివరించారు.


మాట్లాడుతున్న వైవీయూ వీసీ కె.కృష్ణారెడ్డి

ప్రత్యక్ష పరిశీలనతో ఆచరణాత్మక జ్ఞానం


ఇండస్ట్రియల్ విజిట్ ప్రారంభిస్తున్న వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి తదితరులు

వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి

వైవీయూ: ప్రత్యక్ష అనుభవం ద్వారా ఆచరణాత్మక జ్ఞానాన్ని పొందడానికి పరిశ్రమల సందర్శన ఉపయుక్తమవుతుందని యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి అన్నారు. వైవీయూ ఎంబీఏ విభాగం విద్యార్థుల ఇండస్ట్రియల్ విజిట్ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ నిర్వహణతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్నవారు దేశ విదేశాల్లో రాణిస్తారన్నారు. ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథ రెడ్డి మాట్లాడుతూ క్షేత్ర స్థాయి పరిశీలన ద్వారా సమగ్ర జ్ఞానాన్ని పొందుతారన్నారు. వైవీయూ స్కూల్ ఆఫ్ కామర్స్ ల్యాండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ వై.సుబ్బరాయుడు మాట్లాడుతూ విద్యార్థులు పరిశ్రమల సందర్శనలో అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ పి.సరిత మాట్లాడుతూ పరిశ్రమల్లో ఉత్పత్తి, మార్కెటింగ్, మానవ వనరులు, ఫైనాన్స్, పరిశోధనా అభివృద్ధి, డాక్యుమెంటేషన్ వంటివి తెలుసుకుంటారన్నారు.

అనంతరం కొప్పర్తి ట్రయోవిజన్ ప్రైవేట్ లిమిటెడ్‌ను విద్యార్థులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంబీఏ బీఓఎస్ చైర్మన్ డాక్టర్ గంగయ్య, అకడమిక్ కన్సల్టెంట్లు టి.అనిల్ దేవకుమార్, వెంకటరమణయ్య, పి.రాజశేఖర్, పి.సుధీర్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ మరణం దేశానికి తీరని లోటు

కడప కార్పొరేషన్‌ : దేశ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం బాధాకరమని మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. శుక్రవారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ నిష్కళంక రాజకీయ వేత్త, అసాధారణ మేధావి అని కొనియాడారు. దేశం ఓ గొప్ప ఆర్థిక వేత్తను, దార్శనికున్ని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. జయచంద్రారెడ్డి, బంగారు నాగయ్య, సీహెచ్ వినోద్, షఫీ, ఏ1 నాగరాజు, పోతుల శివారెడ్డి, లక్ష్మయ్య, పేట నాగరాజు, కంచుపాటి బాబు, టీపీ వెంకట సుబ్బమ్మ, క్రిష్ణవేణి, ఉమామహేశ్వరి, రత్నకుమారి పాల్గొన్నారు.

కడప వైఎస్‌ఆర్ సర్కిల్‌: మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్‌సింగ్ మరణం దేశానికి తీరని లోటు అని పీసీసీ ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఆలీఖాన్ పేర్కొన్నారు. నగరంలోని ఇందిరాభవన్‌లో మన్మోహన్ సింగ్ సంతాప సభ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బండి జకరయ్య, సత్తార్, గౌస్ పీర్, ప్రసాద్‌గౌడ్, సిరాజుద్దీన్, శ్యామలమ్మ పాల్గొన్నారు.

- మన్మోహన్ సింగ్ మరణంతో దేశం గొప్ప నాయకుణ్ణి కోల్పోయిందని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి ఓ ప్రకటనలో తెలిపారు.
- మన్మోహన్ సింగ్ మరణం బాధాకరమని కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా మైనార్టీ చైర్మెన్ ఖాదర్‌ఖాన్ అన్నారు. తన కార్యాలయంలో మన్మోహన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
- నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలో మన్మోహన్ సింగ్‌కు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మక్బూల్ బాషా, సిద్ధరామయ్య, మడగలం ప్రసాద్, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

వైవీయూ: దేశం గర్వించదగిన ఆర్థిక సంస్కరణల రూపశిల్పి మన్మోహన్‌సింగ్ అని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి అన్నారు. వైవీయూ పరిపాలన భవనంలో విద్యార్థులతో కలిసి మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య ఏజీ.దాము, డా.అనిత, డాక్టర్ సరిత, అధ్యాపకులు పాల్గొన్నారు.

- కడప నగరంలోని డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో మాజీ ప్రధాని మన్మోహన్ చిత్ర పటానికి వైస్ చాన్సలర్ ఆచార్య జి.విశ్వనాథకుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ డాక్టర్ మన్మోహన్‌సింగ్ తీసుకువచ్చిన ఆర్థిక సంస్కరణల గురించి ప్రస్తుతించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎస్.రాజేష్ కుమార్‌రెడ్డి, ఫణీంద్రరెడ్డి, పాల్గొన్నారు.


మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు


వైవీయూలో మన్మోహన్‌సింగ్‌కు నివాళి అర్పిస్తున్న వీసీ, ప్రిన్సిపల్ తదితరులు


డా. వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూలో నివాళులర్పిస్తున్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

సాంకేతికతను వినియోగించుకోవాలి

కమలాపురం : రైతులు సాంకేతికతను వినియోగించుకుని వ్యవసాయంలో అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే పుత్తా చైతన్య రెడ్డి తెలిపారు. శుక్రవారం సబ్సిడీపై వచ్చిన డ్రిప్, స్ప్రింకర్ల లారీలను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం అధికారులతో కలసి వాటిని రైతులకు అందజేసి మాట్లాడారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా తక్కువ నీటితో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. మైక్రో ఇరిగేషన్ పీడీ వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో డ్రిప్, స్ప్రింకర్లు కమలాపురంలోనే ఫస్ట్ పంపిణీ చేశామన్నారు. ఏడీఏ నరసింహారెడ్డి, ఏఓ సరస్వతి పాల్గొన్నారు.